క్లుప్తంగా

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నెలో ఉద్యానవన, పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు ఆయిల్‌పామ్ పంట సాగుపై అవగాహన కల్పించారు. పంట నిర్వహణ అధికారి రవళి, కంపెనీ ప్రతినిధి రమణారెడ్డి మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ పంట సాగు చేసే రైతులకు ఎకారకు 57 మొక్కలు, రసాయన ఎరువులు, పంట సాగుకు అయ్యే పెట్టుబడుల నిమిత్తం ఏడాది రూ. 10,500 చొప్పున నాలుగేళ్లు అందజేస్తారన్నారు. పంట సాగు చేసిన నాల్గో సంవత్సరం నుంచి దిగుబడి వస్తుందని, సాగునీటి వసతి కలిగిన రైతులు పంట సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తిగల రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

బోదకాల వ్యాధిపై అవగాహన



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో బోదకాల వ్యాధిపై వైద్యులు అబ్దుల్ అలీం, మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు ఐదుగురితో గ్రూపుగా ఏర్పడి ఒక్కో గ్రూప్ నుంచి 50 రక్త నమూనాల చొప్పున మొత్తం 300 రక్త నమూనాలు సేకరించారు. ముఖ్యంగా ఈ వ్యాధి క్యూలెక్స్ అనే దోమ కుట్టడం వల్ల వస్తుందని తెలిపారు. మైక్రో ఫైలేరియా అనే సూక్ష్మక్రిమి ద్వారా సంక్రమిస్తుందని చెప్పారు.

పాఠశాలల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ

బేతంచెర్ల: పట్టణంలోని మెయిన్ జెడ్పీ హైస్కూల్‌తో పాటు మండల పరిధిలోని యంబాయి, సీతారామాపురం పాఠశాలను డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరుశాతం, మధ్యాహ్న భోజనం తదితర వాటిని పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ-2 అబ్రహం ఉన్నారు.

బాలికాభివృద్ధితోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న సీడీపీఓ శంషాద్‌బేగం

డోన్ టౌన్: బాలికల అభివృద్ధి జరిగినప్పుడే దేశం ముందుకు వెళుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్‌బేగం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని యు.కొత్తపల్లె గ్రామంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవ వారోత్సవాల భాగంగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బాలికలు ఇంటా బయట ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. తల్లిదండ్రులకు, స్నేహితులకు నిరభ్యంతరంగా చెప్పాలన్నారు. బాల్యవివాహాల అనర్థాలపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆశ్రమానికి అభాగ్యురాలు



ఆశ్రమ నిర్వాహకులకు అప్పగిస్తున్న సమితి సభ్యులు

డోన్ టౌన్: పట్టణంలోని 12వ వార్డులో నివసిస్తున్న బోయ రంగమ్మ అనే అభాగ్యురాలను స్ఫూర్తి సేవా సమితి సభ్యులు మంగళవారం అనంతపురం జిల్లా నార్పల చెన్నకేశవ వృద్ధాశ్రమంలో చేర్పించి మానవత్వం చాటుకున్నారు. ఎవరూ లేని రంగమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో కాలనీవాసులు సమితి సభ్యులకు సమాచారమిచ్చారు. సమితి సభ్యులు ఆమెను వృద్ధాశ్రమంలో చేర్పించి ఆశ్రమానికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో స్ఫూర్తి మధు, భాస్కర్, మోహన్‌రెడ్డి, నారాయణస్వామి, ఆశ్రమ నిర్వాహకురాలు స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

- ఆగస్టు 24వ తేదీ ప్యాపిలి తహసీల్దార్ కార్యాయలం ఎదురుగా ఉన్న యూటర్న్ వద్ద బైక్‌ను వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొనడంతో అనంతపురం జిల్లా ఊటకల్లు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో వ్యక్తి గాయపడ్డాడు. అతని మృతితో భార్య, ఇద్దరు కుమారులు పెద్ద దిక్కును కోల్పోయారు.
- సెప్టెంబర్ 3వ తేదీ ప్యాపిలి మండం పెద్దపొదిళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారుడు మృతి చెందారు.
- సెప్టెంబర్ 13వ తేదీ బేతంచెర్ల పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద బైక్ డివైడర్‌ను ఢీకొనడంతో దుర్గాపేట కాలనీకి చెందిన యువకుడు మృతి చెందాడు. తలకు తీవ్ర గాయం కావడంతో ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి.

ప్రాణాలకు 'హెల్మెట్టే' రక్ష

- హెల్మెట్ ధరించు.. ప్రాణాపాయం నివారించు
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- ప్యాపిలో మండలంలో పెరిగిన రోడ్డు ప్రమాదాలు
- ఆరు నెలల వ్యవధిలో ఐదుగురి మృతి



హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

ప్యాపిలి: ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎంవీఐ అధికారులు, పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ఎక్కువశాతం మంది పెడచెవిన పెడుతున్నారు. ఉరుకులు, పరుగుల జీవితంలో గమ్యానికి త్వరగా చేరుకోవాలన్న ఆత్రం అందరిలోనూ ఉంటుంది. గమ్యానికి సకాలంలో చేరడం కన్నా క్షేమంగా చేరుకోవడమే ముఖ్యం. ఉదయమనగా ఇంటి నుంచి పని నిమిత్తం బయటకు వెళ్లిన ఇంటి యజమాని తన కోసం ఇంటి వద్ద భార్యా పిల్లలు ఎదురుచూస్తున్నారన్న విషయాన్ని మరువకూడదు. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో తలకు తీవ్రమైన గాయాలై దుర్మరణం చెందినవారంతా హెల్మెట్ ధరించకపోడంతోనే భారీ మూల్యం చెల్లించుకున్నారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ప్రాధాన్యత గురించి కాసేపు చర్చించుకుంటారు..కానీ ఉదాసీనత, ఏమవుతుంది లే.. అనే నిర్లక్ష్యం కారణంగా హెల్మెట్‌ను భారంగానే భావిస్తున్నారు.

ద్విచక్రవాహనాల ప్రమాదాలే ఎక్కువ

దేశవ్యాప్తంగా ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్రవాహనాల ప్రమాదాలే ఎక్కువగా జరుగుతున్నట్లు ఓ సర్వేలో తేలింది. హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం నుంచి సురక్షితంగా బయటపడవచ్చని అనేక సంఘటలు నిరూపించాయి. హెల్మెట్ ధరించకుండా ప్రమాదానికి గురైనవారు తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కటే మృతి చెందిన సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. హెల్మెట్ ధరిస్తే ప్రమాద సమయాల్లో తలకు గాయం కాకుండా బయటపడేందుకు 90 శాతం అవకాశం ఉన్నట్లు మోటర్ సైకిల్ హెల్మెట్ స్టడీ నివేదిక వెల్లడించినట్లు అధికారులు చెబుతున్నారు.

ఆరు నెలల్లో జరిగిన ప్రమాదాలు

- గత ఆరు నెలల్లో ప్యాపిలి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో హెల్మెట్ లేకపోవడంతోనే తలకు బలమైన గాయాలై మృతి చెందిన వారే ఉన్నారు.
- మార్చి 26న మెట్టుపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి
- ఆగస్టు 21న ప్యాపిలిలో ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఒకరు మృతి
- ఆగస్టు 24న ప్యాపిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఒకరు మృతి
- సెప్టెంబర్ 3న పెద్దపొదిళ్ల వద్ద జరిగిన ప్రమాదంలో తండ్రీకుమారుల మృతి

భద్రతగా భావించాలి



హెల్మెట్ ధరించడాన్ని యువత భారంగా భావిస్తున్నారు. అవగాహన లేని కారణంగా అతివేగంతో హెల్మెట్ లేకుండానే ద్విచక్రవాహనాలు నడుపుతున్నారు. యువతతో పాటు ఇతరులు కూడా హెల్మెట్ ధరించకుండా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగితే ఆ లోటును ఎవరూ భర్తీ చేయలేరు. తమపై ఆధారపడిన వారికి గుండె కోత మిగల్చడం భావ్యం కాదు. హెల్మెట్ ధరించడం తమ బాధ్యత అని భావించినప్పుడే అందరిలోనూ మార్పు వస్తుంది. ద్విచక్రవాహనంపై ప్రయాణించే ఇద్దరూ హెల్మెట్ ధరించాలి.

–మధుసూధన, ఎస్‌ఐ, ప్యాపిలి

నకిలీ మద్యం గుర్తింపునకు యాప్

డోన్ టౌన్: మద్యం ఒరిజినలో, నకిలీదో తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్ష అనే యాప్‌ను ప్రవేశపెట్టిందని డోన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ వరలక్ష్మీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని కొనుగోలు చేసిన మద్యం సీసాపై అనుమానం ఉంటే బార్ కోడ్‌ను స్కానింగ్ చేయాలన్నారు. ఇలా చేస్తే తయారీదారుని వివరాలు, బ్యాచ్ నంబర్, కోడ్ నంబర్ తెలుసుకోవచ్చని చెప్పారు. దీని ద్వారా నకిలీ మద్యాన్ని సులభంగా గుర్తించవచ్చని పేర్కొన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే డోన్ ఇన్‌స్పెక్టర్ నంబర్ 9440902584కు సంప్రదించాలని సూచించారు.

మద్యంమత్తులో పేడ రంగు ద్రావణం తాగి..



బాధితున్ని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని ఆటోనగర్‌కు చెందిన గొల్ల మహేష్ అనే వ్యక్తి మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పేడ రంగును కలుపుకుని తాగడంతో తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమ్మిత్తం స్థానిక వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నె ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పలు వస్తువులపై జీఎస్టీ తగ్గించిందన్నారు. గతంలో ఉన్న 5,12,18,24 శాతం జీఎస్టీ స్లాబ్‌లను ఇటీవల తగ్గించిందని తెలిపారు. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తులు, యంత్ర పరికరాలు, మెడిసిన్స్, పాల పదార్థాలు, నోట్ పుస్తకాలు, పేపర్స్, ప్రింటర్స్, ల్యాప్‌టాప్, తదితర వస్తువుల ధరలు తగ్గాయన్నారు. అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నరేంద్రనాథరెడ్డి, కృష్ణదాసు, సంటిరెడ్డి, అన్నపూర్ణ, లక్ష్మిదేవి, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్‌పై ప్రధాని స్పష్టత ఇవ్వాలి



మాట్లాడుతున్న వాల్మీకి సంఘ నాయకుడు రామభూపాల్

అవుకు(కొలిమిగుండ్ల): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టత ఇవ్వాలని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర యూత్ అధికార ప్రతినిధి రామభూపాల్ కోరారు. మంగళవారం సుంకేసుల గ్రామంలో వాల్మీకులతో సమావేశం నిర్వహించారు. 16న కర్నూలులో జరిగే సభకు హాజరవుతున్న ప్రధాని వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయం తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. దశాబ్దాలుగా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీలు ఇవ్వడం.. ఎన్నికలు పూర్తయి అధికారంలోకి రాగానే విస్మరిస్తున్నారని ఆరోపించారు. సంఘం మండల అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, మండల ఉపాధ్యక్షుడు శివరామయ్య, నాయకులు రమేష్, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



అంబులెన్స్‌లో ప్రసవించిన వెంకటలక్ష్మమ్మ

కోవెలకుంట్ల: నిండు గర్భిణీని ప్రసవ నిమిత్తం మంగళవారం 108లో ఆసుపత్రికి తీసుకెళుతుండగా అంబులెన్స్‌లోనే ప్రసవించింది. బనగానపల్లె మండలం టంగుటూరుకు చెందిన నాగమద్దిలేటి భార్య వెంకట లక్ష్మమ్మకు పురటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు కాల్ చేశారు. కోవెలకుంట్లకు చెందిన అంబులెన్స్‌లో నంద్యాలకు తీసుకెళుతుండగా గోస్పాడు మండలం పసురపాడు సమీపంలో అంబులెన్స్‌లోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు అంబులెన్స్ ఈఎంటీ సతీష్ కుమార్, పైలెట్ షంషీర్ తెలిపారు. ప్రసవ అనంతరం వైద్య చికిత్స నిమిత్తం వారిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు పేర్కొన్నారు.

చైన్ స్నాచర్‌కు దేహశుద్ధి

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో ఓ మహిళ మెడలోని చైన్‌ను లాగేందుకు యత్నించిన చైన్ స్నాచర్‌ను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. మంగళవారం రాత్రి శ్రీరామనగర్‌లో ఉన్న మెడికల్ షాపునకు ఓ మహిళ మందుల కోసం వస్తోంది. నిందితుడు బైక్‌పై వచ్చి చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. ఈ హఠాత్పరిణామంతో మహిళ తన చేతులతో దొంగని పట్టుకుని కేకలు వేసింది. దీంతో అక్కడున్న వారంతా దొంగను పట్టుకుని చితకబాది పట్టణ పోలీసులకు అప్పజెప్పారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.





బురదమయంగా మారిన వెంకటగిరి- సీతారామాపురం రోడ్డు, ముద్దవరంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

బురద రోడ్లు.. గుంతల రహదారులు

బేతంచెర్ల: మండలంలోని వెంకటగిరి, ముద్దవరం గ్రామాల సమీపంలో వర్షపునీరు, మురుగు రహదారిపైకి ప్రవహించడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంకటగిరిలో మురుగు నీరు వెళ్లే మార్గాలు లేకపోవడంతో సీతారామాపురం రహదారిపై నీరు నిల్వ చేరి బురదమయంగా మారింది. ఇదే పరిస్థితి ముద్దవరం గ్రామంలోనూ నెలకొంది. గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుని మురుగునీరు రహదారిపై ప్రవహించకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

ఇంజక్షన్‌తో పెయ్యదూడల పుట్టుక సాధ్యం



పశువీర్య దోస్‌లను అందజేస్తున్న అధికారులు

డోన్: పశుసంవర్ధక రంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయని ఉమ్మడి కర్నూలు జిల్లా పశుగణాభివృద్ధి శాఖ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక పశువైద్యశాలలో లింగనిర్ధారిత పశువీర్య డోస్‌లను ఏడీఏ డాక్టర్ నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రూ.150 మాత్రమే చెల్లించి పశుపోషకులు లింగనిర్ధారిత వీర్యాన్ని పొందవచ్చని తెలిపారు. గతంలో దీని ధర రూ.500 ఉండేదని పేర్కొన్నారు. ఈ ఇంజక్షన్‌తో 90 శాతం పెయ్యదూడలు పుట్టే అవకాశం ఉందని తెలిపారు. గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ సహకారంతో ప్రభుత్వం ఈ సాంకేతికతను అభివృద్ధి చేసిందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి, గౌసియా, భాను, సిబ్బంది మహమ్మద్ రఫీ, నవ్య, హైమావతి, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

18న మండల మీట్

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి మంగళవారం తెలిపారు. ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన జరిగే సమావేశంలో విద్య, వైద్యం, తాగునీరు, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ఆయా శాఖల మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో తప్పక సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని సూచించారు.

సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ

కొలిమిగుండ్ల: రబీ సీజన్‌లో రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీని మంగళవారం ఆర్‌ఎస్‌కేలలో ప్రారంభించారు. మండల వ్యాప్తంగా నాలుగు రోజుల నుంచి రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 1800 క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రస్తుతం వంద క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే రావడంతో ఒక్క రోజే పంపిణీ చేశారు. మిగిలిన 1700 క్వింటాళ్లు ఒకటి, రెండు రోజుల్లో వస్తాయని సిబ్బంది పేర్కొన్నారు. మండలానికి అదనంగా 1200 క్వింటాళ్లు అవసరమని ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. వర్షాలు కురవడంతో రైతులు విత్తనం వేసేందుకు సిద్ధమవుతున్నారు.

నేడు, రేపు స్కూళ్లకు సెలవు

డోన్ టౌన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్లు మండల విద్యాధికారి ప్రభాకర్ తెలిపారు. ఆయా తేదీల్లో జరగాల్సిన ఎఫ్ఏ-2 పరీక్షలను ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించాలని జిల్లా అధికారులు ఆదేశించినట్లు పేర్కొన్నారు.

పరుగు పందెంలో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం గీతా

కోవెలకుంట్ల: ఫిట్ ఇండియా మినీ మారథాన్ స్పోర్ట్స్ మీట్‌లో పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం గీతా తెలిపారు. సెప్టెంబర్ 28వ తేదీ బెంగళూరులోని జేకేవీకే క్రీడామైదానంలో నిర్వహించిన 400 మీటర్ల పరుగు పందెంలో తమ పాఠశాలకు చెందిన విశ్వక్ సత్తాచాటి రజత పతకం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థిని హెచ్‌ఎం తోపాటు ఫిజికల్ డైరెక్టర్లు హర్ష, ఓబులేసు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాజేష్

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామానికి చెందిన బోయ రాజేష్ బేస్‌బాల్ పోటీల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించాడు. ఈనెల 13న కర్నూలు ఇంటోర్ స్టేడియంలో జరిగిన అండర్-19 జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో రాణించాడు. అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టు తరుపున ఆడనున్నాడు.

ఆందోళనలు ఉధృతం చేస్తాం

డోన్ టౌన్: ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ఆంధ్రప్రదేశ్ స్పెషాల్టీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) జోన్ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ నెల 10వ తేదీ నుంచి నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రూ.650 కోట్ల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మానవతాదృక్పథంతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు ప్రథమ చికిత్స అందించి ప్రభుత్వాస్పత్రులకు పంపుతున్నామని తెలిపారు.

ప్రధాని పర్యటనకు వ్యతిరేకంగా నిరసన





డోన్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు, సీపీఎం నాయకులు

డోన్ టౌన్: ఏపీకి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నాలుగోసారి రాష్ట్ర పర్యటనకు వస్తున్న ప్రధాని మోదీని వామపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శించాయి. మంగళవారం సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 'మోదీ గో బ్యాక్' నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్యాకేజీలు, పోలవరం, కడప స్టీల్ ప్లాంట్, విశాఖ ఉక్కు పరిరక్షణ వంటి హామీలు విస్మరించారని ఆరోపించారు. ఈ నెల 16వ తేదీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాని పర్యటన వల్ల ప్రజలకు ఉపయోగం లేదని, ప్రజాధనం వృథా అవుతుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకయ్య, పట్టణ కార్యదర్శి రాముడు, పార్టీ పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి శివరామ్ పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనతో ఏం ఉపయోగం?

బేతంచెర్ల: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనతో రాష్ట్రానికి ఏం ప్రయోజనమని సీపీఐ, సీపీఎం నాయకులు ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని పాత బస్టాండ్‌లో వామపక్ష పార్టీలు 'మోదీ గో బ్యాక్' నినాదాలతో నిరసన తెలిపారు. ఏపీకి హామీలు నెరవేర్చని మోదీ పర్యటనను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎం నాయకులు భార్గవ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



బేతంచెర్లలో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

హామీలు అమలు చేయాలి

బనగానపల్లె రూరల్: విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో బనగానపల్లెలో 'మోదీ గో బ్యాక్' నిరసన కార్యక్రమం జరిగింది. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ-ఉత్తరాంధ్రలకు ప్యాకేజీలు ఇవ్వాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి హామీలు అమలు చేయకపోతే పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. సీపీఐ మండల కార్యదర్శి శివయ్య, సీపీఎం, ఏఐఎస్ఎఫ్ నాయకులు సుబ్బయ్య, ఎర్రిస్వామి, శివనాగయ్య పాల్గొన్నారు.



బనగానపల్లెలో నిరసన తెలుపుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు

నరేంద్రమోదీ పర్యటనపై నిరసన

కొలిమిగుండ్ల: ప్రధాని నరేంద్రమోదీ ఉమ్మడి జిల్లా పర్యటనపై సీపీఐ, ఏఐటీయూసీ, రైతు సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నాయకులు సూర్యనారాయణ, మహేష్, పెద్దయ్య, నరసింహుడు, సూర్యుడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి తీరని అన్యాయం



ప్యాపిలి: నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

ప్యాపిలి: ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అన్యాయం చేశారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ, మండల కార్యదర్శి మహేశ్ విమర్శించారు. ప్రధాని కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో సీపీఐ నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. విభజన సమయంలో ఏపీకి రావాల్సిన ప్రయోజనాలు ఇవ్వలేని మోదీ పర్యటన వల్ల ఉపయోగం ఏం ఉందని ప్రశ్నించారు. రాయలసీమలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి

విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌ఏ రహిమాన్ డిమాండ్ చేశారు. ప్యాపిలిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాల్సిన కేంద్రం రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి నెడుతోందన్నారు. నాయకులు నెట్టికల్లు, రంగస్వామి, నాగరాజు, సుంకన్న, రామాంజనేయులు, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వర ఆలయ నూతన కమిటీ

ప్యాపిలి: స్థానిక నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఇది వరకు ఉన్న కమిటీ కాలపరిమితి ముగిసి ఐదేళ్లు గడిచిపోయాయి. తక్షణమే పాత కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని ఏర్పాటు చేసుకోవాలని ఏపీ స్టేట్ కుర్ని సంక్షేమ సంఘం నుంచి ఆదేశాలు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు అధ్యక్షుడిగా మాసాని కుమార్, ఉపాధ్యక్షుడిగా కునిగిరి శివశంకర్, సెక్రెటరీగా మాసాని పరమేశ్వరయ్య, జాయింట్ సెక్రెటరీగా బండికె వెంకటకృష్ణ, కామర్తి సోమశేఖర్, కోశాధికారిగా కునిగిరి సురేశ్‌లను ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఇంద్ర ధనస్సు కనువిందు

అల్పపీడన ప్రభావంతో మంగళవారం కోవెలకుంట్లలో చిన్నపాటి వర్షం కురిసింది. వర్షం ఆగిపోయాక సాయంత్రం ఆకాశంలో ఇంద్ర ధనస్సు కనువిందు చేసింది. వివిధ రంగులతో కూడిన ఇంద్ర ధనస్సును చిన్నపిల్లలు ఆసక్తిగా తిలకించారు. – కోవెలకుంట్ల



ఆకాశంలో కనువిందు చేస్తున్న ఇంద్ర ధనస్సు